శుభోదయ డైనమిక్
శుక్రవారం 5 జూన్ 2026

## ఆర్వో ఫిల్టర్ మరమ్మత్తు పనులకు శ్రీకారం

కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్



**చౌటుప్పల్ జూన్ 04, శుభోదయ డైనమిక్ న్యూస్** ఆర్వో ఫిల్టర్ మరమత్తు పనులను చేయించి.. వార్డు ప్రజలకు త్వరలోనే ఫిల్టర్ ద్వారా త్రాగునీరు అందుబాటులోకి తెస్తానని కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ అన్నారు. దివీస్ పరిశ్రమ, చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ల సహకారంతో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 13వ వార్డు రాంనగర్ కాలనీలో ఆగిపోయిన ఆర్వో ఫిల్టర్ మరమ్మతు పనులను కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ కుమార్ గురువారం ప్రారంభించారు. మొదట బోరు మరమ్మతులను చేశారు. బోరులో సమృద్ధిగా నీరు ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బత్తుల వాణి విప్లవ కుమార్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆర్వో ఫిల్టర్ చెడిపోయిందని వార్డు ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దివీస్ పరిశ్రమ సహకారంతోనే వాటర్ ఫిల్టర్ నిర్మించడంతో, వాటర్ ఫిల్టర్ మరమ్మత్తుల గురించి పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లానన్నారు. వెంటనే స్పందించిన యాజమాన్యం బోరు, ఫిల్టర్ మరమ్మతులను చేపట్టిందన్నారు. త్వరలోనే వార్డు ప్రజలకు ఫిల్టర్ వాటర్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్కాల కుమార్ గౌడ్, చెవగోని వెంకటేష్ గౌడ్, మార్గం నర్సింహ్మ యాదవ్, చెరుకు అశోక్ గౌడ్, గూయని జంగయ్య, చెరుకు సాయి గౌడ్, దివిస్ ప్రతినిధి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 50% రాయితీపై జీలుగ విత్తనాలు అందుబాటులో

**నేరేడు చర్ల, శుభోదయ డైనమిక్** వానాకాలం 2026 కోసం తెలంగాణ ప్రభుత్వం జీలుగ విత్తనాలను 50% రాయితీపై రైతులకు అందుబాటులో ఉంచింది. 30 కిలోల బ్యాగ్ పూర్తి ధర ?4,905 కాగా, రైతులు ?2,452.50 చెల్లించి పొందవచ్చు. ఒక బ్యాగ్ 2--2.5 ఎకరాలకు సరిపోతుంది. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్ జిరాక్స్‌లతో మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని వ్యవసాయ అధికారి షేక్ జావేద్ తెలిపారు. జీలుగ సాగుతో నేల సారవంతం పెరిగి, ఎరువుల ఖర్చు తగ్గి, దిగుబడులు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

## నేరేడుచర్లలో వార్డు సభ నిర్వహణ



**నేరేడు చర్ల, శుభోదయ డైనమిక్** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో 1, 7, 8 వార్డుల సంయుక్త వార్డు సభ మరియానంద స్కూల్‌లో నిర్వహించారు. సభలో ఇంకుడు గుంతల నిర్మాణం, స్వచ్ఛ సర్వేక్షణ్, తడి--పొడి చెత్త వేరు చేసే విధానం, వనమహోత్సవం, తాగునీటి నిర్వహణ, వర్షాకాల ముందస్తు చర్యలు, పట్టణ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## డాక్టర్స్ సెల్ఫీ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరణ



**నల్లగొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** టీబీ ముక్త్ భారత్ అభియాన్ రెండో దశ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా క్షయ నివారణ కేంద్రం, గైనకాలజిస్ట్ అసోసియేషన్ సంయుక్తంగా రూపొందించిన టీబీ అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆవిష్కరించారు. క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో గ్రామాలు, స్లమ్‌లు, వల్నరబుల్ ప్రాంతాల్లో ఉచిత ఏఐ చెస్ట్ ఎక్స్‌రే స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 10 నిమిషాల్లో పరీక్ష పూర్తవుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరం: కలెక్టర్ చంద్రశేఖర్




**నల్లగొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చండూరు మండలం బంగారుగడ్డ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పాల్గొన్నారు. పర్యావరణ వారోత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. గ్రామ పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పంట అవశేషాల దహనం నివారణ, తాగునీటి నాణ్యత పర్యవేక్షణపై అవగాహన కల్పించారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళల స్వయం ఉపాధి, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై కూడా సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో మొక్క నాటి ఇంకుడు గుంతలు, నర్సరీలను పరిశీలించారు.

## తెలంగాణ ఉద్యమకారుల వేదిక జిల్లా అధ్యక్షులుగా చలమల్ల



**శుభోదయ డైనమిక్ న్యూస్, జూన్ 04, సూర్యాపేట** : మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ జేఏసీ సూర్యాపేట కో కన్వీనర్ గా 5 సంవత్సరంలు స్వంత పనులను కుటుంబాన్ని పక్కకు పెట్టి నిరంతరం క్రియాశీలకంగా రాత్రింబవళ్లు, ఉద్యమం పాల్గొని పోలీసుల లాఠీ దెబ్బలు తిని, కేసుల అయి అరెస్టులై అనేక నిద్రలేని రాత్రులు పోలీస్ స్టేషన్ లో గడిపి అనారోగ్యానికి గురిఅయి జైలుకు కూడా వెళ్లి మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా నష్టపోయి ఇల్లు ఒళ్ళు గుల్ల చేసుకోనీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధననే అంతిమ లక్ష్యంమని, ప్రాణాలను పణంగా పెట్టి ఎన్నో వేయా ప్రయాసలకు తట్టుకొని ప్రత్యేక తెలంగాణ సాధించే వరకు ఉద్యమంలో పాల్గొన్న చలమల్ల నర్సింహ ను తెలంగాణ ఉద్యమకారుల వేదిక (ఖఎ) రాష్ట్ర కమిటీ చైర్మన్ నరాల సత్యనారాయణ తెలంగాణ ఉద్యమకారుల వేదిక సూర్యాపేట జిల్లా అధ్యక్షునిగా నియమించడం జరిగింది నన్ను గుర్తించి తెలంగాణ ఉద్యమకారుల వేదిక సూర్యాపేట జిల్లా అధ్యక్షునిగా నియమించినందుకు రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నానుఉద్యమంలో అమరులైన కుటుంబాలను, ఉద్యమకారులను ఐక్యం చేసి ఉద్యమకారులకు స్వయం ఉపాధి కొరకు 10 లక్షల ఆర్థిక సహాయం, వారి పిల్లలకు ఉచిత విద్యను, తమ కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం అందించాలని, 200 గజాల ఇంటి స్థలం ఇచ్చి ఇల్లును నిర్మించి ఇవ్వాలని, నెలకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, ఉద్యమకారులకు, వారి కుటుంబ సభ్యులు అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఉద్యమకారులు పడుతున్న ఇబ్బందులు సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూన్నాను. ఇట్టి నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ దృష్టికి తీసుకుపోతానని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం చేస్తానని వారన్నారు

## కుడకుడ వార్డు సభలో ఎస్పీ నరసింహ




**సూర్యాపేట బ్యూరో,శుభోదయ డైనమిక్** చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలో గురువారం నిర్వహించిన వార్డు సభలో జిల్లా ఎస్పీ నరసింహ పాల్గొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సమస్యలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించడంలో ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీసేనని అన్నారు. ప్రజల ధన, ప్రాణ రక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని, డయల్ 100, 112 ద్వారా ఫిర్యాదు అందిన వెంటనే బాధితుల వద్దకే వెళ్లి కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. గంజాయి, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు

## సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎలుగూరి చంటిబాబు గౌడ్ కి చిరు సన్మానం



**శుభోదయ డైనమిక్ న్యూస్, జూన్ 04, సూర్యాపేట** : సూర్యాపేట పట్టణంలోని పబ్లిక్ క్లబ్ లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పబ్లిక్ క్లబ్ ఫంక్షన్ హాల్ నిర్వహకులు ఎలుగూరి చంటిబాబు గౌడ్ కి ఎంఈఎఫ్ రాష్ట్ర కోశాధికారి చింత జాన్ విల్సన్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంటి బాబు ఫంక్షన్ హాల్ నిర్వహిస్తూనే పేద ప్రజలకు తనదైన శైలిలో సామాజిక సేవ చేస్తుంటారని ప్రజా సేవలో ముందు ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాల మాదిగల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి జయశంకర్ మాదిగ, నాయకులు చెరుకుపల్లి సందీప్, పాలడుగు శ్రీనివాస్, జర్నలిస్టు ప్రభు, కిరిటి, శివ తదితరులు పాల్గొన్నారు.

## లింగారెడ్డిగూడెంలో వార్డు సభ నిర్వహణ




**చౌటప్పుల్, శుభోదయ డైనమిక్** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా 1వ వార్డు (లింగారెడ్డిగూడెం)లో వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ పాల్గొని ఓటర్ల జాబితా సవరణ, పంటల మార్పిడి, పరిశుభ్రత--పర్యావరణ పరిరక్షణ, ప్రజా భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. స్థానిక సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## సర్వారంలో గడ్డివాములు దగ్ధం




**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్ :** గరిడేపల్లి మండలం సర్వారం గ్రామంలో గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలు మరింత వ్యాపించకుండా నియంత్రించారు. ఈ ఘటనలో గడ్డివాములకు భారీ నష్టం జరిగినట్లు తెలుస్తోంది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సంబంధిత అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి సర్పంచి చింతకాయల వినోద నాగేశ్వరావు ఉప సర్పంచ్ కందుల పద్మ నాగిరెడ్డి
వివరాలు సేకరిస్తున్నారు. రైతులు, గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక చేయూత



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్** నగర్ మరియు ఈనెల 10వ తారీకు మఠంపల్లి మండలం బక్కమంతుల గూడెం గ్రామంలో జరిగే శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణం సందర్భంగా ఏర్పాటు చేయు అన్నదాన కార్యక్రమానికి హుజూర్నగర్ భజన బృందం ఫాలోవర్స్ గ్రూప్ భక్తుల నుండి గ్రూప్ అడ్మిన్ లక్ష్మీ తిరుపతమ్మ మూల విరాట్ విగ్రహ దాతలు ఆకుల రాము రజిని దంపతులు సేకరించిన 250 కేజీల బియ్యం 11 వేల రూపాయల నగదు రెండు క్వింటాల కూరగాయలు వెయ్యి గ్లాసులు 50 కేజీల పెరుగు సేకరించి లక్ష్మీ తిరుపతమ్మ గుడి చైర్మన్ సిలువేరు నాగేశ్వరరావు నాగమణి దంపతులకు పెద్దలు దాతలు బాచిమంచి కొండయ్య తూముల శ్రీనివాస్ చిట్టిపోతుల రమేష్ రామిశెట్టి ఉపేందర్ ముదుంబై దామోదరచార్యుల చేతుల మీదుగా నిర్వాహకులకు అందజేయడం జరిగినది

## మఠంపల్లి గ్రామ సభకు వినతి



**మఠం పల్లి, శుభోదయ డైనమిక్** మఠంపల్లి మెయిన్ రోడ్డులోని డివైడర్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ప్రజల భద్రత, గ్రామ సౌందర్యం దృష్ట్యా తొలగించాలని కోరుతున్నాము. వర్షాకాలంలో బలమైన గాలుల కారణంగా అవి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది. అలాగే ఏ వ్యక్తి లేదా సంస్థ ఫ్లెక్సీ అయినా 7--10 రోజుల వరకు మాత్రమే ఉంచి తర్వాత తొలగించే విధానం అమలు చేయాలి.అదే స్థానాల్లో మఠంపల్లి చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, విద్యాసంస్థలు, ప్రముఖులు మరియు గ్రామ అభివృద్ధి విశేషాలను తెలియజేసే సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామ సభను వినమ్రంగా కోరుతున్నాము.

## సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్:** హుజూర్నగర్ పట్టణం మంత్రి క్యాంపు కార్యాలయంలో 14వ వార్డుకు చెందిన వడ్లానపు అంజమ్మ గత కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో ఆపరేషన్ జరిగినందున వారి కుటుంబానికి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహాయంతో 60000 వేల రూపాయల సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కును 14వ వార్డ్ కాంటెస్ట్ కౌన్సిలర్ కోలపూడి జ్యోతి యోహాన్ చేతులు మీదుగా అందించడం జరిగింది. యోహాన్ మాట్లాడుతూ గతంలో కంటే సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్స్ హుజూర్నగర్ నియోజకవర్గంలో ఎక్కువ శాతం అమౌంట్ తో మంత్రి చలువతో త్వరగా వస్తున్నాయని అదేవిధంగా హుజూర్నగర్ పట్టణంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వాలని, ప్రతి పేదవాడికి సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఉచిత కరెంటు, ఫ్రీ బస్, ఇంత మంచి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని హుజూర్నగర్ నియోజకవర్గాన్ని అన్ని మండలాల్లో గ్రామాల్లో పట్టణాల్లో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అని ఇంత గొప్ప మహానాయకుడు మనకుండటం అదృష్టంగా భావించాలని మాట్లాడారు.

లిఈ కార్యక్రమంలో పెద్దారపు రామకృష్ణ,దుగ్గి సైదులు, కోళ్లపూడి కాంతయ్య, లచ్చుమల్ల సైదులు మువ్వ బాబు పాల్గొన్నారు

